క్లుప్తంగా

శేష శయనావతారంలో జగన్నాథుడు



శేష శయనావతారంలో దర్శనమిస్తున్న జగన్నాథ స్వామి

భీమునిపట్నం: భీమిలిలో జరిగిన జగన్నాథ రథోత్సవాల్లో భాగంగా గురువారం ముగింపు రోజున స్వామి వారు శేష శయనావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అర్చకులు ఆర్.సింగరాచార్యులు ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. సాయంత్రం స్వామి వారి మారు రథోత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా భక్తులు రథం వద్ద స్వామిని దర్శించుకున్నారు. అర్చకులు సింగరాచార్యులు పూజలు చేశారు. అనంతరం భక్తులు రథాన్ని లాగగా మెయిన్ రోడ్డు, పెద్దబజారు, చిన్నబజారు ప్రాంతాల్లో ఊరేగింపు నిర్వహించారు.

వివాదంలో ఉన్న భూమికి నోటీసు

మధురవాడ : విశాఖ రూరల్ మండలం పరదేశిపాలెం రెవెన్యూ గ్రామంలో కోర్టు వివాదంలో ఉన్న భూమి గేటు వద్ద నోటీసు అంటించినట్టు తహసీల్దార్ ఎస్.రమణయ్య గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పరదేశిపాలెం రెవెన్యూ గ్రామం పరిధి తిమ్మాపురం – మారికవలస రోడ్డులో ఉన్న సర్వే నంబరు 180 పిలో 10.80 ఎకరాల భూమి వివాదంలో ఉంది. దీనికి సంబంధించి ఏపీఐఐసీ టవర్స్ మంగళగిరిలో ఉన్న ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమిషనర్ ఎదుట హాజరుకావాలని నోటీసు జారీ చేసినట్టు చెప్పారు. సదరు భూమిపై హక్కు కోసం కోర్టును ఆశ్రయించిన ఎస్.వెంకటపాండు రంగరాజు గతంలో ఇచ్చిన అడ్రస్‌లో అందుబాటులో లేనందున భూమి గేటు వద్ద నోటీసు అంటించినట్టు రమణయ్య తెలిపారు.

నిత్యావసర సరకుల అందజేత



సరకులు అందిస్తున్న పూర్వ విద్యార్థులు

తగరపువలస: చిట్టివలస జెడ్పీ హైస్కూల్‌కు చెందిన పదో తరగతి 1991 – 92 బ్యాచ్ విద్యార్థులు గురువారం కార్మికవాడలోని ఒక పేద కుటుంబానికి బియ్యం, నిత్యావసర సరకులు అందించారు. స్థానికంగా ఉంటున్న ఆశపు కుందన పుట్టిన రోజు సందర్భంగా వీటిని అందించినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఆశపు భవానీ ప్రసాద్, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు ఎస్.శ్రీనివాసవర్మ, ఉపాధ్యక్షుడు హేమ, గోవాడ సురేష్, సుబ్బారావు, పిట్టా రఘు శ్రీనివాసరెడ్డి, కంబపు శ్రీనివాసరెడ్డి, వై.ప్రతాప్‌సింగ్, సునీల్ కుమార్ సామంత్, రెడ్డి నానాజీ పాల్గొన్నారు.

భక్తితో బక్రీద్ ప్రార్థనలు



ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

భీమునిపట్నం: స్థానిక జామియా మసీద్ ఈద్గా మందిరంలో గురువారం బక్రీద్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లింలు అధిక సంఖ్యలో పాల్గొనగా మసీద్ ఇమాం మహ్మద్ నసీం అక్తర్ బక్రీద్ సందేశాన్ని అందించారు. షేక్ అబ్దుల్ నయీం, షేక్ మదీన్, షేక్ యాసిన్ పాల్గొన్నారు.

ట్రిపుల్ ఆర్ సెంటర్లతో పర్యావరణ పరిరక్షణ

- ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలి
- జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ



ఎండాడలో ట్రిపుల్ ఆర్ సెంటర్‌ను పరిశీలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

కొమ్మాది: రెడ్యూస్, రీయూజ్, రీ సైకిల్ (ట్రిపుల్ ఆర్) సెంటర్లు పర్యావరణ పరిరక్షణకు ఎంతో ఉపయోగపడతాయని జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ అన్నారు. గురువారం ఆయన తగరపువలస, ఎండాడ ప్రాంతాల్లో గల ట్రిపుల్ ఆర్ సెంటర్లను సందర్శించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ ట్రిపుల్ ఆర్ సెంటర్ల ద్వారా ఎంతో ఉపయోగం ఉంటుందన్నారు. తక్కువ వినియోగం, పునర్వినియోగం, శుద్ధి చేసి వినియోగించడంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ కోసం ఈ సెంటర్లు ఎంతో ఉపయోగపడతాయని, వ్యర్థాల నిర్వహణకు స్థిరమైన అభివృద్ధికి బాటలు వేస్తాయని పేర్కొన్నారు. అనేక రకాల గాజు, కాగితం, మెటల్, ప్లాస్టిక్, టైర్లు, దుస్తులు, పుస్తకాలు, బ్యాటరీలు, ఎలక్ట్రానిక్ వ్యర్థాలను ఈ సెంటర్ ద్వారా సేకరించి రీ సైకిల్ చేసి ఆట వస్తువులతోపాటు నిత్య జీవితంలో వినియోగించే అనేక వస్తువులు తయారు చేయవచ్చన్నారు. అనంతరం తగరపువలసలో గల సబ్బివానిపాలెంలో బుక్ కేఫిని సందర్శించారు. పౌరులకు విజ్ఞానాన్ని అందించే పుస్తకాలు అందుబాటులో ఉంచాలని సూచించారు. పర్యటనలో ఆయనతోపాటు అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు, ప్రధాన వైద్యాధికారి నరేష్ కుమార్, పర్యవేక్షక ఇంజినీర్లు శామ్‌సన్ రాజు, సత్యనారాయణ రాజు, జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వేలాడుతున్న విద్యుత్ దీపాలు



ఐటీ హిల్ – 2 మార్గంలో వేలాడుతున్న విద్యుత్ లైట్

కొమ్మాది: సాగర్‌నగర్ బీచ్ రోడ్డు నుంచి రుషికొండ బీచ్ రోడ్డు వరకు, ఐటీ హిల్ – 2 రోడ్డు మధ్యలో గల విద్యుత్ దీపాలు అనేకచోట్ల గాల్లో వేలాడుతున్నాయి. ఇవి గాలికి ఎప్పుడు పడిపోతాయో తెలియని పరిస్థితి నెలకొంది. కొన్ని లైట్లు పగటి పూట వెలుగుతుంటే రాత్రి పూట వెలగడం లేదు. మరికొన్ని గాల్లో వేలాడుతూ ప్రయాణికులను భయాందోళనకు గురి చేస్తున్నాయి. సంబంధిత అధికారులు వీటిని సరి చేయాలని పలువురు కోరుతున్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

మధురవాడ: ఏపీ ట్రాన్స్‌కో మారికవలస విద్యుత్ సబ్ స్టేషన్ జేఎస్ఎన్‌యూఆర్ఎమ్ కాలనీ 11 కేవీ ఫీడర్ పరిధిలో నిర్వహణ, మరమ్మతులు కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని కొమ్మాది సబ్ స్టేషన్ ఏఈఈ వై.సురేష్ కుమార్ చెప్పారు. ఈ మేరకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు మారికవలస జంక్షన్, జేఎస్ఎన్‌యూఆర్ఎం కాలనీ, శారదానగర్, ఏపీటీడబ్ల్యూ గురుకుల ఇంగ్లిష్ మీడియం స్కూల్, పీపీ 2 కాలనీ, గాయత్రి హాస్పిటల్, వైఎస్సార్ కాలనీ, ఇంటిగ్రిల్స్ అపార్ట్‌మెంట్, ఓంకార్ నగర్, హెచ్‌పీ పెట్రోల్ బంక్, చైతన్య టెక్నో స్కూల్, ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్, వికలాంగుల కాలనీ, కార్పెంటర్స్ కాలనీ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ పరఫరా నిలిచిపోతుంది. వినియోగదారులు గమనించాలని కోరారు.

వైఎస్సార్ సీపీ భీమిలి జేసీఎస్ ఇన్‌ఛార్జులు వీరే

తగరపువలస: వైఎస్సార్‌సీపీ జేసీఎస్ ఇన్‌ఛార్జిల జాబితాను సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం విడుదల చేసింది. ఈ మేరకు మండలాలకు సరగడ రఘునాథ రెడ్డి (భీమిలి), గంద్రేటి శ్రీను (ఆనందపురం), శిరిగుడి ఆదినారాయణ (పద్మనాభం)ను నియమించారు. జీవీఎంసీ పరిధిలో భీమిలి జోన్‌కు సంబంధించి జగుపల్లి ప్రసాద్ (1, 2 వార్డులు), గుండాసి మధు నాయుడు (3, 4 వార్డులు), మధురవాడ జోన్‌లో పోతిన సురేష్ (5), గాదె రోసిరెడ్డి (6), కుడితి రామారావు (7), ఉప్పలూరి గోపి (8), లెంక సత్తిబాబు (89, 98 వార్డులు)ను నియమించారు.

వైభవంగా తొలి ఏకాదశి పూజలు



ప్రత్యేక అలంకరణలో శ్రీవేంకటేశ్వర స్వామి



భీమిలిలో విశేష అలంకరణలో వేంకటేశ్వర స్వామి



రుషికొండపైన శ్రీవేంకటేశ్వర స్వామి సన్నిధిలో పారాయణ చేస్తున్న భక్తులు

కొమ్మాది: రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం తొలి ఏకాదశిని పురస్కరించుకుని శ్రీ సింహ శైల సేవా సమితి ఆధ్వర్యంలో 500 మందితో శ్రీ విష్ణు సహస్ర నామ పారాయణ 5 సార్లు నిర్వహించారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమైన పారాయణ మధ్యాహ్నం 2 వరకు కొనసాగింది. అనంతరం సాయంత్రం అన్నమాచార్య సంకీర్తనతో కోలాటాలు, శ్రీవారి నామ సంకీర్తనలు భక్తులను అలరించాయి. అదేవిధంగా జీవీఎంసీ 8వ వార్డు ఎండాడ శివాలయంలో, 4వ వార్డు మంగమారిపేట రామాద్రిలో, 6వ వార్డు కొమ్మాది అష్ట లక్ష్మి ఆలయంలో తొలి ఏకాదశి పూజలు వైభవంగా నిర్వహించారు. ఈ పూజల్లో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.

భీమునిపట్నం: భీమిలి కృష్ణాకాలనీ కొండపైనున్న కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం తొలి ఏకాదశి సందర్భంగా లక్ష తులసి పూజ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమ నిర్వహణకు కె.రామకృష్ణ, విజయలక్ష్మి దంపతులు సహకారం అందివ్వగా, అర్చకులు అప్పలాచారి ఆధ్వర్యంలో పూజలు చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు గాడు అప్పలనాయుడు, రేలంగి పెదబాబు, కె.ముత్యాలరావు, కె.సన్నీబాబు, జి.సన్యాసిరావు, ఆనంద్, కుమార్ పాల్గొన్నారు.

వేంకటేశ్వర స్వామికి విశేష పూజలు

ఆనందపురం : మండలంలోని గంభీరంలో ఉన్న శరణ్య వేంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. తొలి ఏకాదశి సందర్భంగా ఆలయ ధర్మకర్తలు పైడా కృష్ణప్రసాద్ దంపతులు పూజలు చేశారు. నవకలశ, పంచామృతాభిషేకాలు, విష్ణు సహస్ర నామ పారాయణ చేశారు. ఈ సందర్భంగా దేవాలయ అర్చకులు స్వామి వారికి పుష్పాలతో ప్రత్యేక అలంకరణ చేశారు. పరిసర గ్రామాల ప్రజలు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు.

పద్మనాభం: పద్మనాభంలోని కుంతీ మాధవ స్వామి ఆలయంలో గురువారం తొలి ఏకాదశి పూజలు చేశారు. తెల్లవారుజామున 4.30 గంటలకు స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి పంచామృత అభిషేకాలు నిర్వహించారు.

తదుపరి బలిహరణం నిర్వహించారు. అనంతరం భక్తులు కుంతీ మాధవ స్వామి, శ్రీదేవి భూదేవి సమేత అనంతుని ఉత్సవ విగ్రహాలను దర్శించుకుని పూజలు చేశారు.

గతుకుల రోడ్డుతో అవస్థలు



విజయానందపురం ఏఎస్ జ్యూట్ మిల్లు వద్ద గోతులు పడిన రోడ్డు

పద్మనాభం: విజయానందపురం జంక్షన్‌కు సమీపంలోని ఏఎస్ జ్యూట్ మిల్లు వద్ద రోడ్డు గతుకుల మయమైంది. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించడానికి వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డుపై విజయనగరం, సింహాచలం, ఎస్.కోట, కొత్తవలస వెళ్లే బస్సులు, ద్విచక్ర వాహనాలు తిరుగుతూ ఉంటాయి.

వాహనాలతో రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుంది. అయితే గోతులు పడడంతో ద్విచక్ర వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఆర్ అండ్ బీ అధికారులు స్పందించి గోతులు పూడ్చేందుకు చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

వీధుల్లో పాలిథిన్ గుట్టలు



పాత లోకల్ ఆఫీసు వీధిలో పాలిథిన్ సంచుల గుట్టలు

తగరపువలస: నిషేధిత పాలిథిన్ సంచుల వినియోగంపై వినియోగదారులు, వ్యాపారులు జీవీఎంసీకి సవాల్ విసురుతున్నారు. సచివాలయ, శానిటరీ కార్యదర్శులు ఎంత పటిష్టంగా తనిఖీలు చేసినా వీటి వాడకం స్వేచ్ఛగా సాగుతోంది. మార్కెట్, రోడ్డు, దుకాణాలు ఎక్కడ చూసినా పాలిథిన్ గుట్టలే కనిపిస్తున్నాయి. వీటి వినియోగం వల్ల ఎదురయ్యే అనర్థాలపై ప్రచారం చేస్తున్నా ప్రజలు పెడచెవిన పెడుతున్నారు. వీటి వినియోగంపై జీవీఎంసీ అధికారులు మరింతగా నిఘా పెంచాలని పలువురు కోరుతున్నారు.

సింహగిరిపై మొక్కల పంపిణీ



మొక్కలతో ప్రధానార్చకుడు, ట్రస్ట్‌బోర్డు సభ్యులు



భక్తులకు మొక్కలు అందజేస్తున్న సభ్యులు

సింహాచలం: తొలి ఏకాదశి పురస్కరించుకుని గురువారం సింహగిరిపై స్వధర్మ వాహిని ఆధ్వర్యంలో భక్తులకు మొక్కలు పంపిణీ చేశారు. గాజువాకకు చెందిన భక్తులు కాశీ కృష్ణ, కంచి శేషగిరి రావు కడియం నుంచి తీసుకొచ్చిన వెయ్యి మొక్కలు అందజేశారు. ఆ మొక్కలకు ఆలయ ప్రధానార్చకుడు ఇరగవరపు రమణాచార్యులు, అర్చకులు కల్యాణ మండపంలో పూజలు చేశారు. అనంతరం రాజగోపురం వద్ద ఉన్న కళావేదిక వద్ద దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు, అధికారులు భక్తులకు మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు సంపంగి శ్రీనివాస రావు, వారణాసి దినేష్‌రాజ్, సువ్వాడ శ్రీదేవి, ముదుండి రాజేశ్వరి, ఆలయ ఏఈవో భ్రమరాంబ, సూపరింటెండెంట్ పాలూరి నరసింగరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళావేదికపై అన్నమయ్య సేవా ట్రస్ట్ నిర్వాహకురాలు సునీత ఆధ్వర్యంలో సామూహిక విష్ణుసహస్రనామ పారాయణ చేపట్టారు.

తాగునీరు వృథా



కొండపేట శివాలయం వద్ద పైప్‌లైన్ లీకవడంతో వృథాగా పోతున్న తాగునీరు

తగరపువలస: గోస్తనీనదిలో తాగునీటి వనరులు అడుగంటుతున్న వేళ జీవీఎంసీ భీమిలి జోన్‌లో పైప్‌లైన్ల మరమ్మతుల కారణంగా రోజూ వేలాది లీటర్ల నీరు నేల పాలవుతోంది. కొండపేట పంప్ హౌస్ నుంచి భీమిలి బ్యాంకు కాలనీ వరకు రోజూ ఎక్కడో ఒకచోట పైప్‌లైన్లు పగిలిపోతుండటంతో ఆ ప్రాంతంలో ఫౌంటెయిన్లు, చెరువులు దర్శనమిస్తున్నాయి. ఆయా మార్గాల్లో రాకపోకలు సాగించేవారు ఈ నీటి గుంటలతో ఇబ్బంది పడుతున్నారు. శాశ్వత ప్రాతిపదికన పైప్‌లైన్లకు మరమ్మతులు చేపట్టి, నీటి వృథాను అరికట్టాలని జోన్ ప్రజలు కోరుతున్నారు.

అర్హులకు పథకాలు అందించడమే లక్ష్యం



సంతపేటలో సర్వేలో సచివాలయ సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నాయకులు



వాంబేకాలనీలో ఓ ఇంటి వద్ద సంక్షేమ పథకాలపై ఆరా తీస్తున్న జెడ్సీ కనకమహాలక్ష్మి

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ రెండో వార్డు సంతపేటలో గురువారం 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి శిల్లా సరళారాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటి వరకు సంక్షేమ పథకాలు అందని వారిని గుర్తించి వారికి అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని ప్రారంభించారని తెలిపారు. ఇందులో భాగంగా వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వస్తారని, వారికి కుటుంబ సభ్యులు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు చిల్ల సూర్యనారాయణరెడ్డి, జగన్నాథ ఎల్లాజీరెడ్డి, చిల్ల ప్రమీల, చేట్ల శ్రీనివాసరెడ్డి, జీరు పద్మ, శిల్లా వంశీరెడ్డి, కంచుబోయిన వెంకటరావు, చేట్ల అప్పలసూరమ్మ, ఊడికల శ్రీరామమూర్తి, మద్ది మహాలక్ష్మి, చేట్ల ఢిల్లీశ్వరి, వాసుపల్లి నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'జగనన్న సురక్ష'

మధురవాడ: జీవీఎంసీ మధురవాడ జోన్ – 2 పరిధిలోని 7వ వార్డులో జగనన్న సురక్ష కార్యక్రమం ఉత్సాహంగా నిర్వహించారు. ఇందులో భాగంగా గురువారం వాంబేకాలనీలో అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, గృహ సారథులు పలు నివాసాలకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్న తీరు, ఎదురవుతున్న ఇబ్బందులు, జగనన్న సురక్ష కార్యక్రమంలో అందించే సేవలు వివరించారు. ఎవ్వరికైనా ప్రభుత్వ పథకాలు అందడంలో ఇబ్బందులు తలెత్తితే ఆయా వార్డు సచివాలయాల్లో లేదా నేరుగా తమను సంప్రదించాలని జెడ్సీ కనక మహాలక్ష్మి చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ 7వ వార్డు అధ్యక్షుడు పోతిన శ్రీనివాసరావు, మంగ తదితరులు పాల్గొన్నారు.

వాంబేకాలనీ యూపీహెచ్‌సీకి రూ.15 లక్షలతో ప్రహరీ



యూపీహెచ్‌సీ ఎదుట జరుగుతున్న పనులు

మదురవాడ: జీవీఎంసీ 7వ వార్డు వాంబేకాలనీలో ఉన్న అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రూ.15 లక్షలతో ప్రహరీ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ కాలనీలో సుమారు 20 వేల నివాసాలు ఉన్నాయి. అయితే ఆస్పత్రి చుట్టూ నివాసాలు, బడ్డీలు ఉండడంతో ప్రహరీ అవసరమని అధికారులు గుర్తించి నిధులు మంజూరు చేశారు. అయితే దీని చుట్టూ ఉన్న బడ్డీలను మాత్రం రోడ్డుపై పెట్టి నిర్మాణ పనులు చేస్తుండడంతో ఆస్పత్రికి వచ్చే రోగులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

సిరులతల్లికి ఘనంగా సహస్ర తులసీపూజ



సహస్ర తులసి పూజలో సిరులతల్లి

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మికి గురువారం సహస్ర తులసీపూజ ఘనంగా నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ధర్మకర్తలు సత్యరూపవాణి, ఎం.ధనలత, సతీష్, ఎస్ఎస్ఎస్ సుబ్రహ్మణ్యం, ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి తిరుమలేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు క్షీరాభిషేక సేవ

కనక మహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించనున్నారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.500 చెల్లిస్తే ఇద్దరిని అనుమతించనున్నారు. పూజలో పాల్గొనదలచే భక్తులు 0891 2566514, 2711725 లో సంప్రదించాలి.

'చివరి మజిలీ' మార్గం నరకప్రాయం

మరడపాలెం శ్మశానవాటికకు మార్గం లేక ఇబ్బందులు



శ్మశానవాటికకు వెళ్లే మార్గంలో తుప్పలు



శ్మశానవాటికకు చేరాలంటే ఈ గెడ్డలో దిగాల్సిందే..

తగరపువలస: భీమిలి మండలం రేఖవానిపాలెం పంచాయతీ, మరడపాలెం, మహాలక్ష్మిపురం వాసులు తమ గ్రామ శ్మశానవాటిక కంటే నరకానికి వెళ్లడం తేలిక అంటున్నారు. బంధువుల మృతదేహాలను తీసుకెళ్లడానికి సరైన మార్గం లేకపోవడమే ఇందుకు కారణమని వారంతా అంటున్నారు. మరడపాలెం నుంచి తగరపువలస – భీమిలి రహదారి బీటీరోడ్డును దాటగానే వారికి నిత్యం కష్టాలు మొదలవుతున్నాయి. శ్మశానవాటికకు వెళ్లాలంటే వివాదంలో ఉన్న ప్రైవేట్ స్థలాన్ని ముందుగా దాటాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఆ స్థలం యాజమాన్య హక్కుల విషయం ముగ్గురి మధ్య నలుగుతోంది. ఈ నేపథ్యంలో ఆ స్థలం మొత్తం తుప్పలతో నిండిపోయింది. ఒకవేళ ఈ స్థల వివాదం పరిష్కారమైతే ఎవరో ఒకరి చేతుల్లోకి వెళ్లిపోతుంది. భీమిలి పట్టణానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ స్థలం అత్యంత విలువైనది కావడంతో ఎవ్వరూ తమ స్థలం నుంచి మృతదేహాలను తరలించడానికి ఒప్పుకోరు. అంగుళం స్థలం కూడా ఇవ్వరు. ప్రస్తుతం ఈ స్థలంలో ఎవరూ లేకపోవడంతో అష్టకష్టాలు పడి వెళ్లేవారికి చిట్టివలస చెరువు నుంచి జీరుపేట, చిల్లపేట, గల్లీరోడ్డు మీదుగా వచ్చే గెడ్డనీరు ఇబ్బందిగా ఉంది. శ్మశానవాటికకు చేరుకోవాలంటే ఈ గెడ్డ దాటాల్సిందే. దీంతో ఇక్కడ పైపులు వేసి రహదారి నిర్మించుకుందామన్నా వివాదాస్పద స్థలంలోని వ్యక్తులు అనుమతించడం లేదు.

గుంపులుగా వెళ్లకుంటే భయమే..

మరడపాలెం శ్మశానవాటికకు గుంపులుగా తప్ప ఒకరిద్దరు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా చీకటి పడిన తర్వాత స్మశానవాటికకు ఎట్టి పరిస్థితుల్లోనూ వెళ్లలేరు. భీమిలి రోడ్డును ఆనుకుని వేలాది తుమ్మ చెట్లు దగ్గరదగ్గరగా ఉండడంతో అందులో నుంచి ఒంటరిగా నడుచుకుని వెళ్లడమే కష్టమనుకుంటే... ఇక మృతదేహాలను పాడెపై మోసుకెళ్లడం జరిగే పని కాదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక మరడపాలెం, మహాలక్ష్మిపురం, మూలకుద్దు వాసుల శ్మశాన వాటికకు కేటాయించిన స్థలంలో కనీస వసతులు లేవు. ఎండావానల నుంచి తలదాచుకోవడానికి షెల్టర్లు, నీటి వసతులు లేకపోవడంతో వచ్చిన వారు తుమ్మచెట్ల కింద తలదాచుకుని తలకొరివి సమయంలో గెడ్డలో నీటినే వినియోగిస్తున్నారు. ఈ శ్మశానవాటికకు రహదారి, బోరుబావి, షెల్టర్, మార్గమధ్యలో గెడ్డపై పైపులతో నిర్మాణం కోసం ఈ గ్రామాలకు చెందిన 350 కుటుంబాల ప్రజలు భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావును కలిసి తమ సమస్యలు చెప్పుకోవడానికి సిద్ధం అవుతున్నారు.

ఘనంగా అప్పన్న నిత్య కల్యాణం



జీలకర్రబెల్లం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో గురువారం శయన ఏకాదశి పూజలు(తొలి ఏకాదశి) పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అలాగే స్వామికి ఉదయం 9.30 గంటల నుంచి ఆలయ కల్యాణ మండపంలో నిత్యకల్యాణం ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.